

ఆడపడుచుల పండుగ



బతుకమ్మ పండుగ ఆడపడుచుల పండుగ. 9 రోజులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ పాట పాడుతూ చప్పట్లు కొడుతూ ఆడుకుంటాం.బతుకమ్మ ఆడుతుంటే రోజు రోజుకు కొత్త శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది. ఆడపడుచులు అమ్మగారి ఇళ్ల వెళ్లి సంబరాల్లో పాల్గొనడం ఎంతో అనుభూతినిస్తుంది. – కొత్త శోభ, గృహిణి, కోరుట్ల

ఆనందాలు పంచుకుంటాం



బతుకమ్మ పండుగతో మహిళల్లో ఆనందాలు వెల్లివిరుస్తాయి. మహిళలందరం ఒక్క చోట చేరి, బతుకమ్మ ఆటా పాటలతో సంతోషంగా గడుపుతాం. మహిళల ఐకమత్యం చాటుతాం. తొమ్మిదిరోజుల పాటు జరిగే వేడుకల్లో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా బతుకమ్మ సంబరాలు జరుపుకుంటాం. – పెండెం స్వాతి, గృహిణి, కోరుట్ల

మాకు ఎంతో ఇష్టం



మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగ. 9 రోజులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. పిల్ల లు,పెద్దలు అందరం గౌరమ్మను పూజిస్తాం.బలాన్ని పెంచే నైవేద్యాలు ఆనందాల మధ్యన పంచుకుంటాం. బతుకమ్మ వచ్చిందంటే అందరికీ సంబరాలే.. బతుకమ్మ ఆట పాటలతో ఆ సందడే వేరు.. – మచ్చ సుజాత, రాపెల్లి జమున, కోరుట్ల

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం ఇస్తున్న సభ్యులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌లో శ్రీ వనదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ దుర్గా శరన వారాత్రోత్సవాలకు హాజరు కావాలని ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో అజిత్ రావు, అజయ్, సాయి, శరణ్, తేజరెడ్డి, రాజు రావు, సందీప్ పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి రాజన్న ప్రసాదం



రాజన్న ప్రసాదం అందిస్తున్న నాయకులు

కథలాపూర్: కథలాపూర్ మండల బీజేపీ నాయకులు కరీంనగర్‌లో ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ప్రసాదాన్ని అందించారు. మండలంలోని అభివృద్ధి పనులపై చర్చించామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, ఆరెల్లి సాయి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న జడ్జి



జడ్జి దంపతులకు పూర్ణకుంభ స్వాగతం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆదివారం కరీంనగర్ ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి శివకుమార్ దంపతులు స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా స్వామిజీకి దేవస్థానం పక్షాన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్ స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కొలువులు సాధించిన రైతు బిడ్డ



కేశవ్

వెల్గటూర్: తన తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి పట్టుదలతో చదివి మూడు కొలువులు సాధించి తన కన్న వాళ్ల కలను నెరవేర్చాడు ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బైరి కేశవ్. తొలుత 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికై న కేశవ్, తర్వాత బెటాలియన్ ఏఆర్ ఎస్సైగా ఎంపికై ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రూప్–2కు సన్నద్ధమై ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ కష్టపడితే ఖచ్చితంగా విజయం సాధించవచ్చని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ ఆశయాలతో భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందాలని గొల్లపల్లి మాజీ జెడ్పీటీసీ గోస్కుల జలందర్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్మరణ కార్యక్రమ నిర్వాహకులు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, అనంతుల కాంతారావు, ద్యావర సంజీవరాజు పాల్గొన్నారు.

'ఉపాధి'పనులపై ప్రజావేదిక

సారంగాపూర్: మండలంలో 2024–25లో జరిగిన ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ వేదిక నిర్వహించారు. రూ.6.08 కోట్ల పనులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్డీవో రఘువరన్ మాట్లాడుతూ.. మండలంలో కూలీలకు అధిక పని దినాలు కల్పించామన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు నుంచి రూ.25,783 రికవరీకి ఆదేశించారు. విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, క్యూసి మల్లికార్జున్, ఎంపీడీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలరూరల్: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



దుబ్బరాజన్న ఆలయం ఎదుట బోనాలతో మహిళలు, భవానీ దీక్షాపరులు



పెగడపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



మల్లాపూర్: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, భక్తులు



మేడిపల్లిలో ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు



మెట్‌పల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు



బొమ్మెనలో యజ్ఞం చేస్తున్న భక్తులు

దుర్గామాతకు బోనాలు

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/కోరుట్లటౌన్/మెట్‌పల్లి/సారంగాపూర్/మల్లాపూర్/కథలాపూర్/మేడిపల్లి/పెగడపల్లి/సారంగాపూర్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు.నెత్తిన బోనాలు ఎత్తుకుని డప్పుల చప్పుళ్లతో కళాకారుల విన్యాసాలతో తరలివచ్చి దుర్గామాత మండపంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు పలుచోట్ల భక్తులకు శాకాంబరీ,చండీశ్వరీ (కాళికాదేవి)గా దర్శనమిచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.



రాయికల్‌లో బోనాలతో వస్తున్న భవానీస్వాములు

భగత్‌సింగ్ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం





భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: భగత్‌సింగ్ పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విముక్తి గావించేందుకు 23 ఏళ్ల పిన్న వయసులోనే ఉరికొయ్యను ముద్దాడిన వీర కిశోరం భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బండ శంకర్, కాసారపు మల్లేశం గౌడ్, భగత్‌సింగ్ యువసేన సభ్యులు అరవింద్, భానుతేజ, మారుతి, విశాల్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శమని బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రవీందర్‌రెడ్డి భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం తదితరులు ఉన్నారు.

సీఎంలతో పోటీపడి అభివృద్ధి చేశా..

- మాజీమంత్రి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎంలతో పోటీపడి జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని మాజీమంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలరూరల్ మండలం పొలాసలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ పులివెందులలో న్యాక్ పెడితే.. జగిత్యాలకు కూడా తీసుకొచ్చానని, జెఎన్టీయూ, వ్యవసాయ కళాశాల, అవసరమైన చోట సబ్ స్టేషన్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. వీధి వ్యాపారుల కోసం తైబజార్‌ను రద్దు చేయించానన్నారు. జగిత్యాల బల్దియాలో రూ.200కే నల్లా కనెక్షన్ ఇచ్చామన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడూ బోర్నపల్లి వంతెన నిర్మాణానికి రూ.70కోట్లు మంజూరు చేయించానన్నారు. కొంతమంది అధికారం ఉంటేనే అభివృద్ధి చేస్తామంటున్నారని, గతంలో చేసిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికార పార్టీ పంచన చేరారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక ఇళ్లు ప్రారంభించనివారు ఇప్పుడు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు లక్ష్మణ్, శేఖర్, వెంకన్న, శంకర్, గంగాధర్, దామోదర్ రెడ్డి, మొగిలి, మునీందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: మండలంలోని గొర్రెపల్లి శివారులో వాల్గొండ–గొర్రెపల్లి రహదారిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గొర్రెపల్లి గ్రామస్తులు శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రసిద్ధ ఆలయం శ్రీ రామలింగేశ్వర స్వామి కొలువుదీరిన వాల్గొండ గ్రామానికి రూ.3 కోట్లతో గొర్రెపల్లి నుంచి నిర్మించిన లింక్ రోడ్డును ట్రాక్టర్ వినియోగించి ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లింకు రోడ్డును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరిగి ఆ రోడ్డును మరమ్మతు చేయించాలని కోరారు.

పాతదాంరాజుపల్లి విద్యార్థికి ఓయూలో సీటు

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లికి చెందిన మామిడాల వినోద్ పీజీ (సీపీజీఈటీ–2025) ఫలితాల్లో రాష్ట్రస్థాయి 29వ ర్యాంక్‌తో ఓయూ క్యాంపస్‌లో సీటు సాధించాడు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో ఎస్సెస్సీ, మెట్‌పల్లి పట్టణంలో ఇంటర్, హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేసిన వినోద్ ఓయూ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో ఎంఏ సోషియాలజీ విభాగంలో 29వ ర్యాంక్ సాధించడంతో క్యాంపస్ సీటు లభించింది. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతు పీజీ సోషియాలజీలో చేరి రూరల్ ఎకానమికల్ సోషల్ కండిషన్స్‌పై పరిశోధనలే లక్ష్యంగా ఉన్నత విద్యను అభ్యసిస్తానని తెలిపారు.

దుబాయిలో బతుకమ్మ వేడుకలు



మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

జగిత్యాలక్రైం: గల్ఫ్ వలస జీవులకు బతుకమ్మ లాంటి కార్యక్రమాలతో భరోసా నింపుతుందని వెన్నెల గద్దర్ అన్నారు. శనివారం రాత్రి గల్ఫ్ తెలంగాణ ఫోరం(జీటీఎఫ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైరపర్సన్ అడువాల జ్యోతి, అల్లూరి కృష్ణవేణి, జీటీఎఫ్ అధ్యక్షుడు ఆకుల సురేందర్, తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ సభ్యులు కొట్టాల సత్యం గౌడ్, ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.

హిందూ పరిరక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



రాయికల్‌లో మాట్లాడుతున్న తిరుమల్

రాయికల్: హిందూ పరిరక్షణే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని ప్రాంత వ్యవస్థాపక ప్రముఖ్ గంట తిరుమల్ అన్నారు. ఆదివారం మండలంలోని రాయికల్, మైతాపూర్, భూపతిపూర్ గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ద్వారానే దేశభక్తి పెంపొందడంతో పాటు జాతీయ భావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

సామాజిక పరివర్తనే సంఘ్ లక్ష్యం

పెగడపల్లి: సామాజిక పరివర్తనే సంఘ్ (ఆర్ఎస్ఎస్) లక్ష్యమని ఆర్ఎస్ఎస్ జగిత్యాల జిల్లా సహ కార్యవాహ డాక్టర్ సాయి మధుకర్, విశ్రాంత ఆర్మీ అధికారి బూరుగు జలపతి అన్నారు. మండలంలోని బతికపల్లిలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించారు. హిందుత్వ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ చేపడుతున్న చర్యలను అందరూ స్వాగతించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనసూర్య, స్వయం సేవకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: సంఘటిత హిందూ సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క్ ప్రముఖ్ బూదారపు శ్రీహరి అన్నారు.మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వసంతరావు, గంగారాం, రాజేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకం



సేవాదళ్ జెండాను ఆవిష్కరిస్తున్న సురేశ్ గౌడ్

మల్లాపూర్: భారత జాతీయ కాంగ్రెస్‌లో కాంగ్రెస్ సేవా దళ్ పాత్ర కీలకమని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేశ్ గౌడ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సేవాదళ్ ఉత్సవాల్లో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పాలనలోనే భారతదేశం అభివృద్ధిలో పురోగమించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సిరిపురం రవీందర్, కోటగిరి ఆనంద్ గౌడ్, ఒడ్డె నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ తోటి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేణు

రాయికల్: ఆదివాసీ తోటి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాయికల్ పట్టణానికి చెందిన కురిసెంగా వేణును నియమిస్తు రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం కమల మనోహర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఆదివాసుల సంక్షేమానికి కృషి చేస్తానని, తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై



సలీంను తరలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్

జగిత్యాలక్రైం: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ స్పందించి అతనిని సకాలంలో వాహనంలో తరలించి చికిత్స చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన సలీం పాత బస్టాండ్‌లో గత కొంతకాలంగా పూలు అమ్ముకుంటున్నాడు. ఆదివారం పండుగ రోజు భారీగా రద్దీ ఉండటంతో దుకాణం వద్ద సలీంకు ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి వెళ్లాడు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ గమనించి వెంటనే సలీంను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. దీంతో సలీం కోలుకోవడంతో అతని కుటుంబసభ్యులు ఎస్సై మల్లేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నృసింహస్వామికి గజవాహన సేవ



సారంగాపూర్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామివారికి ఆదివారం రాత్రి గజవాహన సేవ నిర్వహించారు. స్వామివారు, అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం గజవాహనంపై ఆసీనులను చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ఊరేగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాల క్రీడాప్రాంగణంలో పూర్వ విద్యార్థులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని గీతా విద్యాలయంలో 1994–95లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో చిన్నారులకు బాల క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ బాల్య స్మృతులను నెమరువేసుకుని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర సంచాలక్ జిడిగె పురుషోత్తం, లక్ష్మణ్‌రావు, అశోక్‌రావు, బెజ్జంకి సంపూర్ణాచారి, పూర్వ ప్రధానాచార్యులు శంకరయ్య, సిరిసిల్ల వేణుగోపాల్, ప్రదానాచార్య శివకుమార్, రాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాక శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, షర్మిల, శ్రీలత, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని అంబారిపేట చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లకుండా అడ్డుగా కర్రలు, చెంచీలు, మట్టి కుప్పలు పోశారు. దీంతో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు రోడ్డుపైన నిరీక్షిస్తున్నారు. వర్షం కురిస్తే తడుస్తూ రోడ్డుపైన ఉండాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మనోహర్ డిపో మేనేజర్, కోరుట్ల, ఫోన్ నంబర్: 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643